

యం. రాంప్రదీప్

# బడిని బతికించుకుందాం!

www.freegurukul.org
(Values, Skill Based Education In Digital)
https://t.me/helpfulinfo

మరో విద్యా సంవత్సరం కాలగర్భంలో కరిగిపోయింది. కేంద్ర ప్రభుత్వ పథకాలైన సర్వశిక్షా అభియాన్, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ కలిసిపోయి "సమగ్ర శిక్షా అభియాన్"గా రూపుదిద్దుకోబడింది. 2010లో ఏర్పడ్డ విద్యాహక్కు చట్టానికి కేంద్రం కొన్ని కీలక సవరణలు చేసింది. 2016లో రావలసిన నూతన విద్యావిధానంపై ఇంకా కమిటీల పరిశీలన జరుగుతూనే ఉంది. విద్యార్థుల పుస్తకాల బరువుపై, అధిక హోంవర్కుపై సీబీఎస్ఈ నియంత్రణ నిబంధనలు రూపొందించింది. తెలుగు రాష్ట్రాలలో ఆంగ్ల మాధ్యమం జోరందుకుంది. తెలంగాణలో గురుకుల పాఠశాలల స్థాపనకు పునాది పడగా, ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు డీఎస్సీ పరీక్ష నిర్వహించబడింది. జరుగుతున్న పరీక్షలపై అభ్యంతరాలున్నా, నిరంతర సమగ్ర మూల్యాంకన విధానం కొనసాగుతూనే ఉన్నది. ఏకీకృత సర్వీసు నిబంధనలు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. కేంద్ర ప్రభుత్వం నవోదయ పాఠశాల లతోపాటు ఏకలవ్య పేరుతో మరికొన్ని కొత్త పాఠశాలలను ప్రారంభించబోతుంది. ఒకవైపు దేశవ్యాప్తంగా విద్యావిధానం ఈ విధంగా ఉండగా మరొక వైపు వివిధ సంస్థల అంచనాల ప్రకారం మన దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల నిష్పత్తి 51:49గా ఉంది. ప్రైవేట్ పాఠశాలల్లో చేరే నర్సరీ విద్యార్థులను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఈ నిష్పత్తి ప్రైవేట్ పాఠశాలలవైపే మొగ్గుచూపే అవకాశము ంది. యూడైస్ ఆధారంగా చూస్తే 2011 నుండి 2016వరకు దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాలలో ఒక కోటి ముప్పై లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమవ్వగా, ప్రైవేట్ పాఠశాలలో ఒక కోటి 70 లక్షల మంది విద్యార్థులు అదనంగా ప్రవేశాలు తీసుకున్నారు. తెలుగు రాష్ట్రాలలో పరిస్థితులను పరిశీలిస్తే ప్రతి ఏట 5శాతం మంది విద్యార్థులు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు, 2శాతం మంది విద్యార్థులు ప్రాథమికోన్నత పాఠశాలలకు దూరమవుతున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మున్సిపల్ పాఠశాలల్లో ప్రవేశాలు కాస్త మెరుగ్గా ఉన్నాయి. ప్రభుత్వాలు "బడిబాట, బడిపిలుస్తుంది, మన ఊరు మన బడి" వంటి పేర్లతో పిల్లలను చేర్పుకునే కార్యక్రమాలు చేపట్టినప్పటికీ వాటికి నామమాత్రపు స్పందనే లభిస్తోంది. కార్పొరేట్ పాఠశాలలు జనవరి నుండే విద్యార్థుల ప్రవేశాలకు ద్వారాలు తెరుస్తున్నాయి. ఒకప్పుడు జిల్లా కేంద్రాలకే పరిమితమైన గొలుసుకట్టు కార్పొరేట్ పాఠశాలలు ఇప్పుడు మండల కేంద్రాలకు కూడా విస్తరించాయి. ఒక మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాలగా వర్గోన్నతి పొందాలంటే కనీసం 2 సంవత్సరాలు సమయం పడుతుంది. పూర్తి సౌకర్యాలు సమకూరాలంటే మరో ఏడాది అదనపు సమయం పట్టవచ్చు. అదే కార్పొరేట్ పాఠశాలకు అది స్థాపించిన రెండు నెలల లోపులోనే అన్నిరకాల అనుమతులు మంజూరవుతాయి. విద్యాపరంగా పాలకుల విధానాలు ఎలా ఉన్నా, ఉపాధ్యాయులపై కొన్ని బాధ్యతలు ఉన్నాయి.

సీపీఎస్ రద్దు కోసం రాజీలేని పోరాటం చేస్తున్నారు. ఉపాధ్యాయుల అభ్యున్నతికి ఉద్యమాలు అవసరమే. నిరంతర పోరాటాల ద్వారానే సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. ఇప్పుడు ఇదే ఉద్యమస్ఫూర్తిని ప్రభుత్వ పాఠశాలలను నిలబెట్టడానికి ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైంది. పిల్లలు చేర్చుకోవడానికి ప్రచారానికి వెళ్తే మీ పిల్లలను ఎక్కడ చదివిస్తున్నారని అడిగే వారికంటే, మా పిల్లలకు మీరేమి చెపుతారు అని అడగాలనుకొనే తల్లితండ్రులు ఎక్కువ మంది ఉంటారు. విద్యా విధానాలపై ప్రభుత్వాలను ప్రశ్నించడంతోపాటు మనం కూడా మన పనితీరుపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. కొందరు ఉపాధ్యాయులు తమ స్మార్ట్ ఫోన్స్‌తో విద్యార్థులకు వినూత్నంగా బోధిస్తుంటే, అదే పాఠశాలలో మరి కొందరు ఫోన్స్‌తో కాలక్షేపం చేస్తున్నారు. బయోమెట్రిక్ విధానం పెట్టినా సమయపాలనలో కొంతే మార్పు వచ్చిందని విద్యా విషయ నిపుణులు అంటున్నారు. ఈ రోజులలో ఆలయాలకు భక్తులను రప్పించినంత తేలికగా, ప్రభుత్వ బడికి



విద్యార్థులను తీసుకురాలేము. తెలుగు రాష్ట్రాలలో పదివేల పాఠశాలలపైన రేషనలైజేషన్ కత్తి వేలాడుతోంది. అదే జరిగితే ఉపాధ్యాయ పోస్టులలో కోత ఏర్పడుతుంది. విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాలల్లో కనీస స్థాయిలో విద్యార్థులను నిలబెట్టాలంటే మనం అసాధారణ ప్రతిభా పాటవాలు ప్రదర్శించనవసరం లేదు. మనం కొంత ప్రయత్నిస్తే పాఠశాల పూర్వవిద్యార్థుల సహకారం అందకపోదు. గ్రామాలలో అడిగిన వెంటనే స్పందించే దాతలు కొందరు ఉండకపోరు. కొందరు ఉపాధ్యాయులు సమాజంతో మమేకమై గ్రామ పెద్దల సహకారంతో ప్రభుత్వ పాఠశాల లను నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. బడిని బతికించు కోవాలంటే ముందు మన ఆలోచనలో కొంత మార్పు రావాలి. కొత్త విషయాలు నేర్చుకోవడం, వాటిని పాఠ్యాంశాల కు వర్తింపచేసి బోధించడం, మన వ్యక్తిగత సమయంలో కాస్తంత సమయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించడానికి కేటాయించడం వంటి వాటి ద్వారా బడిని నిలబెట్టవచ్చు. ఇటీవల తమిళనాడులో భగవాన్ అనే ఉపాధ్యాయుడు బదిలీ అయితే అతని బదిలీని ఆపమని విద్యార్థులు అధికారులను వేడుకోవడం చూసాం. విద్యార్థులకు మంచి ఆంగ్లం నేర్పించడంకోసం తన నగలను సైతం అమ్మిన అన్నపూర్ణమోహన్ వంటి టీచర్‌ను చూస్తున్నాం. సర్కారు బడి గ్రామ చైతన్యానికి ప్రతీక. సామాజిక అంతరాలను తొలగించడానికి దోహదపడే ఒక అద్భుతమైన వేదిక. ఒకప్పుడు బడే గ్రామానికి కేంద్ర బిందువు, ఇప్పుడు అది కన్నీటి బిందువులకు కేంద్రంగా మారకుండా ఉండాలంటే మనమంతా సమిష్టిగా పనిచేయాలి. ఎందుకంటే విద్యార్థులు లేకపోతే పాఠశాలలు ఉండవు. పాఠశాలలు లేకపోతే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కావు. మరోవైపు పాలకులు ఉపాధ్యాయులకు సమస్యలు ఏమీ లేనట్టు మాట్లాడుతున్నారు. మరి కొందరు ఉపాధ్యాయులకు వేసవి సెలవులు అవసరమా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇటువంటి తరుణంలో ఉపాధ్యాయులు మరింత అప్రమత్తంగా ఉండాలి. సెలవులు అనేవి తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ఎప్పట్నుంచో ఉపాధ్యాయులకు ఇస్తున్నవే. ప్రపంచంలో చాలా దేశాల్లో ఆటమ్ బ్రేక్, వింటర్ బ్రేక్, ఈస్టర్ బ్రేక్, స్ప్రింగ్ బ్రేక్, సమ్మర్ బ్రేక్ వంటి పేర్లతో పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ఇస్తుంటారు. అమెరికాలో కేవలం 180 రోజులు మాత్రమే పనిదినాలుండగా, బ్రెజిల్‌లో 200 రోజులు పనిదినాలున్నాయి. ఉపాధ్యాయులు వెకేషన్ డిపార్ట్‌మెంట్‌కి చెందినవారు కాబట్టి వారికి సంవత్సరానికి కేవలం 6 సంపాదిత

**విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులకు సెలవుల్లోనే శిక్షణ ఇవ్వాలి. ఉపాధ్యాయులకు బోధనే కాకుండా ఎన్నికల నిర్వహణ, జనాభా లెక్కలు, అవసరమైతే ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు సహాయ చర్యల్లో పాల్గొనడం అనేవి చేయవలసి ఉంటుంది. ప్రస్తుతం పాఠశాల విధులతోపాటు సమాంతరంగా ఎన్నికల విధులను ఉపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు.**

సెలవులు మాత్రమే మంజూరు చేస్తారు. మిగతా ఉద్యోగస్తులకు సంవత్సరానికి 30 సంపాదిత సెలవులుంటాయి. గత 5,6 సం॥ల నుండి జాగ్రత్తగా పరిశీలిస్తే ఉపాధ్యాయులు బడిబాట, మన ఊరు- మన బడి, నవ నిర్మాణ దీక్ష వంటి కార్యక్రమాల్లో వేసవి సెలవుల్లోనే పాల్గొంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కరువు మండలాలుగా ప్రకటించిన ప్రాంతాల్లోని పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు వేసవిలోనూ మధ్యాహ్న భోజనం పెట్టిన సందర్భాలున్నాయి. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులకు సెలవుల్లోనే శిక్షణ ఇవ్వాలి. ఉపాధ్యాయులకు బోధనే కాకుండా ఎన్నికల నిర్వహణ, జనాభా లెక్కలు, అవసరమైతే ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు సహాయ చర్యల్లో పాల్గొనడం అనేవి చేయవలసి ఉంటుంది. బోధన ద్వారా ఒక ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో గుణాత్మకమైన మార్పును తీసుకొస్తాడు. ఇందులో నైతికత అనే అంశం ముడిపడి ఉంటుంది. ఈ మార్పు ప్రత్యక్షంగా కనిపించదు. దురదృష్టవశాత్తు పాలకవర్గాలు విద్యపై పెట్టిన వ్యయాన్ని సమాజ వృద్ధికి పెట్టే పెట్టుబడిగా కాకుండా, వృథా ఖర్చుగా భావిస్తున్నాయి. విద్యా రంగంలో వార్షిక లాభాలు, నష్టాలు ఉండవు. నిరంతర ఉద్యమాలు, పోరాటాల ద్వారానే ఉపాధ్యాయులకు రావాల్సిన సౌకర్యాలు లభిస్తాయి. హక్కులు కోల్పోతున్న మిగతా వర్గాల వారు కూడా ఇదే మార్గాన్ని అనుసరించాలి. లేదంటే ప్రజాస్వామ్యం ముసుగులో నియంతృత్వం పెరిగే ప్రమాదముంది.

సెల్ : 9492712836